మార్పు కోసం ...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

విలేకరులు కావలెను
హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను
మరిన్ని వివరాలకు సంపాదించండి
సెల్:9154842842

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 132/ 04 సోమవారం, డిసెంబర్ 2023 పేజీలు: 4/వెల రూ5/-

## తెలంగాణలో ప్రజాస్వామ్య

# పునరుద్ధరణ



2 లో

- ప్రగతిభవన్ ప్రజాభవన్‌గా మార్పు
- ప్రజలకు అందుబాటులో సచివాలయం, ప్రజాభవన్
- ప్రజల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం
- కాంగ్రెస్ విజయం తరవాత రేవంత్ రెడ్డి వెల్లడి
- గాంధీభవన్ వద్ద విజయోత్సాహం.. బాణాసంచా కాల్చి సంబరాలు

## మారిన కాంగ్రెస్ పార్టీ వ్యూహం

- నేడు సిఎంగా ప్రమాణ చేయనున్న రేవంత్
- డిప్యూటి సిఎంగా మల్లు భట్టి విక్రమార్కకి అవకాశం

హైదరాబాద్,డిసెంబర్30(మరో ఉదయం):

తెలంగాణలో విజయం సాధించిండంతో ఆసల్యం చేయకుండా వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ మేరకు సోమవారమే రాజ్‌భవన్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టాలని నిర్ణయించింది. ప్రాథమిక సమాచారం మేరకు రేవంత్‌నే సిఎల్పీ నేతగా ఎన్నుకునే అవకాశం ఉండడంతో ఆయే తదుపర ఇసిఎం అని కాంగ్రెస్ సంకేతాలు ఇచ్చింది, 9న ప్రమాణం చేయాలని తొలుత నిర్ణయించినా ఆలస్యం సరికాదన్న నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలో సిఎంగా రేవంత్, డిప్యూటి సిఎంగా భట్టి విక్రమార్క ప్రమాణం చేయనున్నట్లు తెలుస్తోంది. 9న మంత్రివర్గ విస్తరణ ఉంటుందని అంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు ఆదివారం రాత్రి గవర్నర్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు సంబంధించిన వివరాలు అందించారు. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. 65 సీట్లలో గెలుపు సాధించడంతో అధికారం చేపట్టనుంది. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడటానికి ముందే తెలంగాణకు కొత్త డీజీపీ నియామకం అయ్యారు. డీజీపీ అంజనీకుమార్ యాదవ్ ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ ఆయన్ను ఆదివారం మధ్యాహ్నం ఎలక్షన్ కమిషన్ సస్పెండ్ చేసింది. ఎన్నికల ఫలితాలకు ముందే టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు చెప్పడంతో అంజనీ కుమార్‌తో పాటు ఇద్దరు అదనపు డీజీలు సందీప్‌కుమార్ జైన్, మహేష్ భగవత్‌కు ఈసీ నోటీసులు జారీ చేసింది. రేవంత్‌కు భద్రత కల్పించే అంశంపై అంజనీకుమార్ యాదవ్ చర్చించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణకు కొత్త డీజీపీని ఎలక్షన్ కమిషన్ నియమించింది. ఈ మేరకు రవి గుప్తాను కొత్త డీజీపీగా నియమిస్తూ ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా అంజనీకుమార్ యాదవ్ తర్వాత సీనియర్ పోలీస్ అధికారిగా రవి గుప్తా ఉండటంతో ఆయన్ను డీజీపీగా ఈసీ నియమించింది. రవి గుప్తా 1990 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంతో పాటు ఏసీబీ డైరెక్టర్ జనరల్‌గా కొనసాగు తున్నారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వహించిన అనుభవం కూడా రవి గుప్తాకు ఉంది. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. దీంతో ఈరాత్రే సీఎల్పీ నేత ఎన్నుకోవడం కోసం పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సూచన మేరకు గెలిచిన ఎమ్మెల్యేలను గచ్చిబౌలిలోని హోటల్ ఎల్లాకి రావాల్సిందిగా

మిగతా 2 లో

## బీఆర్ఎస్ పార్టీ 39 స్థానాల్లో విజయం

హైదరాబాద్,డిసెంబర్30(మరో ఉదయం):

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 39 స్థానాల్లో విజయం సాధించింది. రాష్ట్రంలో 119 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఆదివారం ఓట్ లలెక్కింపు జరిగింది. కాంగ్రెస్ పార్టీ 64 స్థానాల్లో గెలుపొందింది. బీజేపీ ఎనిమిది చోట్ల విజయం సాధించగా.. ఎంఐఎం ఏడు, సీపీఐ ఒక స్థానం గెలిచింది. ఎన్నికల్లో ఎలాగైనా హ్యాట్రిక్ విజయం సాధించాలని బీఆర్ఎస్ సర్వశక్తులూ ఒడ్డింది. చాలా చోట్ల స్వల్ప ఓట్ల తేడాతో బీఆర్ఎస్ ఓటమిపాలైంది. ఇక బిఆర్ఎస్ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సహా ఆ పార్టీ నేతలంతా ఓటమి పాలయ్యారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో బిఆర్ఎస్ మంచి ఫలితాలు సాధించింది. గజ్వేల్‌లో కెసిఆర్, సిద్ధిపేటలో హరీష్ రావు, దుబ్బాకలో కొత్త ప్రభాకర్ రెడ్డి, సంగారెడ్డిలో చింతా ప్రభాకర్,జహీరాబాద్‌లో కె మాణిక్ రావు, నర్సాపూర్‌లో సునీతా లక్ష్మారెడ్డిలు గెలుపొందారు. మొత్తం 7 స్థానాల్లో విజయం సాధించారు. బీఆర్ఎస్ గెలిచిన స్థానాలు ఇలా ఉన్నాయి. గ్రేటర్ మైదరాబాద్‌లో కూడా బిఆర్ఎస్ పట్టు సాధించింది. అలాగే ఉమ్మడి కరీంనగర్‌లోనూ మంచి ఫలితాలు వచ్చాయి. కోవ లక్ష్మి, ఆసిఫాబాద్, అనిల్ జాదవ్, బోథ్, పోచారం శ్రీనివాస రెడ్డి, బాన్సువాడ, వేముల ప్రశాంత్ రెడ్డి, బాల్కొండ, కల్వకుంట్ల సంజయ్, కోరుట్ల, మాకునూరి సంజయ్, జగిత్యాల, కల్వకుంట్ల తారకరామారావు, సిరిసిల్ల, పాడి కౌశిక్ రెడ్డి, హుజూరాబాద్, తన్నీరు హరీశ్‌రావు, సిద్ధిపేట, సునీత లక్ష్మారెడ్డి, నర్సాపూర్, కే మాణిక్‌రావు, జహీరాబాద్, చింతా ప్రభాకర్, సంగారెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి, పటాన్‌చెరు,మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్కాజిగిరి, కేపీ వివేకానంద్, కుత్బుల్లాపూర్,మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి, బండారి లక్ష్మారెడ్డి , ఉప్పల్ డి.సుధీర్ రెడ్డి, ఎల్బీ నగర్,సబితా ఇంద్రారెడ్డి, మహేశ్వరం,టీ ప్రకాశ్ గౌడ్, రాజేంద్రనగర్,అరెకపూడి గాంధీ, శేరిలింగంపల్లి, కాలె యాదయ్య, చేవెళ్ల, ముఠా గోపాల్, ముషీరాబాద్, కాలేరు వెంకటేశ్, అంబర్‌పేట,దానం నాగేందర్, ఖైరతాబాద్, మాగంటి గోపీనాథ్, జూబ్లీహిల్స్,తలసాని శ్రీనివాస్ యాదవ్, సనత్‌నగర్, పద్మారావు గౌడ్, సికింద్రాబాద్,లాస్య నందిత సాయన్న, కంటోన్మెంట్, కృష్ణ మోహన్ రెడ్డి, గద్వాల,విజయుడు, అలంపూర్,జగదీశ్ రెడ్డి, సూర్యాపేట,పల్లా రాజేశ్వర్ రెడ్డి, జనగామ,కడియం శ్రీహరి, స్టేషన్ ఘన్‌పూర్,తెల్లం వెంకట్రావ్, భద్రాచలం, గంగుల కమలాకర్, కరీంనగర్ నుంచి గెలుపొందారు.

## ఎన్నికల ఫలితాల వేళ ఇసి సంచలన నిర్ణయం

- డిజిపి అంజన్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్,డిసెంబర్3(మరో ఉదయం):

ఎలక్షన్ కమిషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో ఎన్నికల ఫలితాలు వెలువెడుతున్న సమయంలోనే డీజీపీ అంజనీకుమార్ పై సస్పెన్షన్ వేటు పడింది. ఎన్నికల కౌంటింగ్ పక్రియ జరుగుతుండగానే టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని డీజీపీ కలుసుకోవడాన్ని సీరియస్‌గా తీసుకుంది. రేవంత్‌తో జరపడంతో ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు జరపాలని డీజీపీ అంజనీకుమార్‌తో రేవంత్ రెడ్డి నేటి మధ్యహ్నం కలిసి చర్చించారని తెలిసిందే. అయితే ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్న సమయంలో రేవంత్ రెడ్డిని కలిసి ప్రమాణ స్వీకారంపై చర్చించడంతో డీజీపీపై ఈసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. రేవంత్ రెడ్డిని కలవడంపై అంజనీ కుమార్ ను ఈసీ వివరణ కోరింది.



## నేటినుంచి పార్లమెంట్ సమావేశాలు

### ప్రతిపక్షాలు బాధ్యతగా వ్యవహరించాలన్న ప్రహ్లాద్ జోషి

న్యూఢిల్లీ,డిసెంబర్3(మరో ఉదయం):

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐద రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వచ్చిన తరవాత ప్రారంభం అవుతున్నాయి. దీంతో అధికార బిజెపిలో విజయోత్సాహం తొణికిసలాడుతోంది. ఈ నేపథ్యంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రతిపక్ష పార్టీలను ఘాటుగా హెచ్చరించారు. పార్లమెంట్ సమావేశాలకు అంతరాయం కలిగిస్తే, ఆదివారం చవిచూసిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కంటే దారుణాన్ని ఎదుర్కొంటారన్ని వార్నింగ్ ఇచ్చారు. అయితే అన్ని అంశాలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. నియమ, నిబంధనల ప్రకారం ఇది జరుగాల్సి ఉందన్నారు. డిసెంబర్ 4 నుంచి 22 వరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై వచ్చిన 'క్యాష్ ఫర్ క్వెరీ' మరో రెండు ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ కీలక నివేదిక సమర్పించనున్నది. దీంతో పార్లమెంట్ సమావేశాలపై ఇది ప్రభావం చూపే అవకాశమున్నది. ఈ నేపథ్యంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి, ప్రతిపక్షాలను ప్రధానంగా కాంగ్రెస్ పార్టీని ముందుగానే హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కంటే దారుణాన్ని ఎదుర్కొంటారన్ని వార్నింగ్ ఇచ్చారు. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ చట్టాల మార్పుతోసహా 19 బిల్లులు పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించారు

## మూడు రాష్ట్రాల్లో బిజెపి విజయం

- ప్రజల తీర్పును స్వాగతించిన ప్రధాని మోడీ
- ఫలితాలు నిరాశపరిచాయన్న ఖర్గే ,రాహుల్

న్యూఢిల్లీ,డిసెంబర్3(మరో ఉదయం):

మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బిజెపి ఘన విజయం సాధించింది. ఈ మూడు రాష్ట్రాల్లోను ఆ పార్టీ ప్రభుత్వాలు ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో ఫలితాలపై ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. ప్రజాతీర్పుకు శిరసువంచి నమస్కరిస్తున్నానని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. మూడు రాష్ట్రాల ఫలితాలు సుపరిపాలన, అభివృద్ధి వైపే ప్రజలు కట్టుబడి ఉన్నట్లు సూచిస్తున్నాయన్నారు. బిజెపికి సడలని మద్దతు ఇచ్చిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ ప్రజలకు ప్రధాని కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రజల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా పని చేయనున్నట్లు తెలిపారు. తీవ్రంగా కష్టపడిన పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అభివృద్ధి అజెండాను ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో కార్యకర్తలు సక్సెస్ అయ్యారన్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ ఎన్నికల్లో పార్టీకి లభించిన ఫలితాలు నిరుత్సాహ పరిచాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. తెలంగాణలో తమ పార్టీకి పట్ట కట్టిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ గట్టి పోటీ ఇచ్చిందని ఆయన అంటూ లక్షలాది మంది కార్యకర్తలు చేసిన కృషికి కృతజ్ఞతలు తెలియజేశారు.' తెలంగాణ ప్రజలనుంచి అందిన తీర్పుకు రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు. చతీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో పార్టీకి ఓటు వేసిన వారికి కూడా కృతజ్ఞతలు. ఈ మూడు రాష్ట్రాల్లో ఫలితాలు కచ్చితంగా నిరుత్సాహ పరిచాయి. అయితేఈ మూడు రాష్ట్రాల్లో మేము శక్తివంచన లేకుండా పనిచేసి తిరిగి పుంజుంటాం' అని ట్విట్టర్ వేదికగా ఖర్గే అన్నారు.మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్

మిగతా 2 లో

## అర్థం కాని విధంగా ఫలితాలు

- అయినా బాధ్యతాయుత విపక్ష పాత్ర పోషిస్తాం
- ఓటమిపై విశ్లేషణ చేసుకుని ముందుకు వెళతాం
- పదేళ్ల పాటు అధికారం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు
- ఓటమిపై వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ వ్యాఖ్యలు

హైదరాబాద్,డిసెంబర్30(మరో ఉదయం):



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి గాలి లేదని.. అదే సమయంలో అర్థంకాకుండా ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికల ఫలితాలపై తెలంగాణ భవన్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఫలితాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. ఇది వేవ్ అయితేనేమో రాష్ట్రమంతా ఒకేలా ఉండేది. గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రజలు ఏకపక్షమైన తీర్పునిచ్చారు. మెదక్ జిల్లాలో దాదాపు ఏకపక్షంగా ఉంది. కరీంనగర్‌లో 40-60శాతంగా ఉన్నది. ఇది వేవ్‌లా లేదు. సేమ్ టైమ్ అర్థం కాకుంటా ఉన్నది. మా నాయకులు, అభ్యర్థులతో మాట్లాడిన తర్వాత వారి అనుభవాలను కూడా తెలుసుకుంటాం. పెద్దపల్లి పార్లమెంట్‌లో చెన్నూరులో బాల్క సుమన్ చేసినంత అభివృద్ధి మంత్రులుగా చేసినవారు లేరు. సింగరేణికి మేం

మిగతా 2 లో

## అనూహ్య ఫలితాలతో కెసిఆర్ ఖంగు

- సిఎం పదవికి రాజీనామా సమర్పణ
- వెంటనే ఆమోదించిన గవర్నర్ తమిళ్సై

హైదరాబాద్,డిసెంబర్3(మరో ఉదయం):

తెలంగాణ సీఎం కేసీఆర్ రాజీనామా చేయడం..దానిని గవర్నర్ తమిళ్సై ఆమోదించడం చకచకా జరిగిపోయాయి. సీఎం పదవికి చేసిన రాజీనామా లేఖను గవర్నర్ కు కేసీఆర్ పంపించారు. కేసీఆర్ రాజీనామా లేఖను గవర్నర్ తమిళిసై ఆమోదించారు. ఈ విషయాన్ని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. తెలంగాణలో నూతన ప్రభుత్వం ఏర్పడే వరకు కేసీఆర్ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని గవర్నర్ తమిళిసై బీఆర్ఎస్ అధినేతకు సూచించినట్లు సమాచారం. అంతకుముందు సీఎం పదవికి కేసీఆర్ ఆదివారం సాయంత్రం రాజీనామా చేశారు. తెలంగాణ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో సీఎం కేసీఆర్ రాజ్ భవన్ కు వెళ్లి తన రాజీనామా లేఖను గవర్నర్ కు సమర్పించారు. ఎలాంటి కాన్వాయ్ లేకుండా సాధారణం



మిగతా 2 లో

మార్పు కోసం ...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## మాకొద్దీ దొరతనం!

ఎంతటి అహంకారం..ఎంతటి దురహంకారం...ఎంతటి తలబిరుసు..ఎంతటి నియంతృత్వం..ఎంతటి బంధుప్రీతి..అంతటి అవినీతి..ఎంతగా అధికార దుర్వినియోగం..దగాపడ్డ తెలంగాణ మళ్లీ తెగించింది. పదేళ్లపాటు రాక్షసకాండను అనుభవించిన ప్రజలు తెగించారు. అరివీర శూరులై పోరాడారు. అహంకారం తలకెక్కిన నియంతను గద్దె దించారు. కెసిఆర్ అహంకారంపై అంకుశం దింపారు. మేం తలచుకుంటే నీవెంత..అంటూ హుంకరించారు. సమయం వచ్చినప్పుడల్లా పోరాడడం అలవాటు చేసుకున్న తెలంగాణ ప్రజలు మరోమారు తెలంగాణ కోసం పోరాడారు. గడీల పాలనకు చరమగీతం పాడారు. నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు విముక్తం కలిగించారు. ప్రపంచ చరిత్రలో ఎందరో నియంతలు కాలగర్భంలో కలిశారు. హిట్లర్, ముస్సోలిని వంటి నేతలనే వదిలించుకున్నారు. పలాయనం చిత్తగించేలా చేశారు. ఈదీ అమెన్ లాంటి వారినే పారిపోయేలా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు అవకాశం కోసం చూస్తారు. అవకాశం వచ్చినప్పుడు వీరసింహాల్లా విజృంభిస్తారు. అలా తెలంగాణలో నయానియంత కెసిఆర్‌ను గద్దె దించేందుకు ప్రతి ఒక్కరూ ఏకమయ్యారు. నిరుద్యోగులు, ప్రజలు, మోసపోయిన వారు, జర్నలిస్టులు, ఉద్యోగులు ఇలా సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ ఓటుతో పోటు పొడిచారు. ప్రజలను కలవాల్సిన పనేముందన్న ఓ ఆధునిక నియంతను ప్రజలే దూరం పెట్టారు. నీవు వద్దూ..నీ కుటుంబ వద్దు..నీ పెత్తనం కూడా మాకొద్దు... మాకొద్దీ దొరతనం అని జనం హుంకరించారు. ఈ క్రమంలో నయానియంత...నిజాం వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని.. అహంకారం తలకెక్కిం చుకున్న కెసిఆర్ కోరలు పీకారు. ఇచ్చిన అధికారాన్ని గుంజేసు కున్నారు. మేం తలచుకుంటే నీవెంత.. దొర ఏందిరో దొర పీకుడేందిరో అని తెలంగాణ ప్రజలు గర్జించారు. నిజాంనే తరిమికొట్టిన ఘన చరిత్ర తెలంగాణ ప్రజలది. తెలంగాణ సాధన కోసం ఒక్కటై గళమెత్తి ..1200మందిని బలిదానం ఇచ్చుకుని రాష్ట్రాన్ని సాధించుకున్న ఘనత ఇక్కడి గడ్డకు ఉంది. తెలంగాణ ఉద్యమంలో ముందున్న కెసిఆర్‌ను ఆదరించి పదేళ్ల పాటు మోసిన చరిత్రా ఇక్కడి ప్రజలది. కానీ అదే నేత ప్రజలను చీమల్లా..చీడపురుగుల్లా చూస్తూ..తన కుటుంబ పెత్తనంతో నిరంకుశంగా పాలిస్తే కూడా సహించ లేమని నిరూపించారు. మా సత్తా ఏమిటో చూపిస్తాం అని నిరూపించారు. ప్రగతిభవన్‌ను కట్టుకుని..ప్రజలను దూరంగా పెట్టి...పోలీసులతో పెత్తనం చేస్తూ..కుటుంబానికి..తన కులానికి చెందిన వారికే పదవులు కట్టబెడతూ..ఉద్యమంలో సమిధలైన వారిని పట్టించుకోకుండా రాజ్యమేలారు. అడపాదడపా ప్రజలు హెచ్చరించినా..పట్టించుకోలేదు. ప్రజల భూములను గుంజుకున్నారు..ప్రభుత్వ భూములను మింగడంలో హిరణ్యాక్షుడినే మించి పోయారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ఊళ్లకు ఊళ్లను ముంచారు. వేల ఎకరాలను ప్రాజెక్టులో ముంచారు. ప్రజలను రోడ్డున పడేశారు. రోడ్డెక్కి ఆందోళన చేస్తే పోలీసులతో కొట్టించారు. కేసులు పెట్టి జైలులో పెట్టించారు. తన ఫామ్ హౌజ్ కోసం ప్రజాధనాన్ని వృధా చేసిన గడీల దొరగా నిలిచారు. కానీ అవకాశం రాకపోతుందా అని ఎదురు చూసిన ప్రజలు క(రు)కాల్చి వాతలు పెట్టారు. మా దెబ్బ ఎలా ఉంటుందో అనిరేచి చూపారు. తెలంగాణ ఎన్నికల్లో ప్రజల దెబ్బకు ఆధునిక నియంతకు దిమ్మతిరిగి పోయింది. దెబ్బకొడితే ప్రగతిభవన్ నుంచి బయటపడక తప్పని పరిస్థితి ఏర్పడింది.నిజానికి ప్రజలనే కాదన్న నేతలను చూడలేదు. ప్రజలను కలుసుకోవాల్సిన అవసరమేముందన్న నేతలను చూడలేదు. అంతగా అహంకారం తలకెక్కిన నేతను గద్దె దించేందుకు ప్రజలు అవకాశం కోసం చూశారు. అవినీతికి పెద్దపీట వేస్తూ..నిరుద్యోగుల ఉసురు తీసిన ఘనుడు కెసిఆర్. తాను మాత్రమే మృత్యు కుహరంలోకి వెళ్లానని..తెలంగాణ జాతిపితను అని ప్రచారం చేసుకున్నారు. నిజంగా 1200మంది

అమాయకులు మృత్యువునే ముద్దాడిన విషయాన్ని మరిచిపోయారు. గత దశాబ్ద కాలంగా అంటే తెలంగాణ ఏర్పడ్డ నాటి నుంచి చేపట్టిన పనులపై డబ్బాకొట్టుకుంటూ..ఇదే అభివృద్ధి అంటూ..ప్రజలకు అంతా మేలే చేశామని చెప్పుకుంటూ పోయిన అత్యంత అవినతి సిఎంగా కెసిఆర్ చరిత్ర కెక్కారు. గత పదేళ్లుగా తాము అధికారంలో ఉన్నా చేయలేని పనులకు,చేస్తున్న విమర్శలకు కెసిఆర్ లేదా ఆయన కుటుంబం సమాధానం మాత్రం చెప్పలేదు. దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాలు,నిరుద్యోగ భృతి, ఉద్యోగాల నియామకాలు, రైతుల రుణమాఫీ వంటి విషయాల్లో తెలంగాణ ప్రజలను దగా చేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్లు లీక్ కావడం, ఇంటర్ పరీక్షల అవక తవకలు, ధరణి అవకత వకలు, మియాపూర్ భూముల వ్యవహారం వంటివాటి గురించి ఎంతగా చెప్పు కున్నా తక్కువే. ఇంతటి అహంభావం ఉన్న వ్యక్తిని సిఎంగా ప్రజలు అంగీకరించలేకపోయారు. మేడిగడ్డ భద్రతపైనా ఎదురుదాడికి దిగారు. ప్రధానంగా తెలంగాణ రావడానికి యువత ఆత్మార్పణాలు కారణం. వారంతా పోరాడితేనే తెలంగాణ వచ్చింది. వారంతా కష్టపడి తేనే కెసిఆర్ గద్దెపై కూర్చున్నారు. జర్నలిస్టుల త్యాగాలు కూడా మరువలేనివి. కానీ వారిని కూడా మోసం చేసిన ఘనత కెసిఆర్‌కే దక్కింది. ఉమ్మడి ఎపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సిఎంగా ఉండగా ఇచ్చిన ఇల్లస్థలాలను వారికి అప్పగించాలని గతేడాది ఆగస్టులో సుప్రీం ధర్మాసనం తీర్పు ఇచ్చినా దానిని తుంగలో తొక్కారు. ఇక సుప్రీం తీర్పును కూడా తుంగలో తొక్కన దుర్మార్గపు సిఎంగా కెసిఆర్ చరిత్రకు ఎక్కారు. చిన్నామధ్య తరగతి పత్రికలను ఎండబెట్టి సొంత పత్రికలకు, ఇతర రాష్ట్రాల పత్రికలకు వందల కోట్లు దోచి పెట్టారు. పదవులన్నీ తమవారికే కట్ట బెట్టారు. ఈ క్రమంలో నిరుద్యోగులు, యువత సమస్యలపై తెలంగాణను పాలిస్తున్న కెసిఆర్‌ను తమ సమస్యలపై ఎక్కడిక్కడ నిలదీస్తే...కేసులు పెట్టి జైలుకు వెళ్లేలా చేశారు. అందుకే నియంతను సాగనం పాలని నిర్ణయించారు. ఎక్కడిక్కడ ప్రజలంతా సాయుధులయ్యారు. ఓటుతో సాయుధ పోరాటం చేశారు. ఎన్నికల్లో ఈ సమస్యలపై యువత, జర్నలిస్టులు ఇలా ప్రతి ఒక్కొ ఒక్కో ఈటెలా దూసుకుని వచ్చారు. అందుకే పరాభవం తప్పలేదు. కసీతీరా వేసిన ఓటుతో కెసిఆర్ అనే నరరూపరాక్షసుడు హతమయ్యాడు. తెలంగాణ ప్రజలకు ఓ రకంగా విముక్తి దొరికింది. తెలంగాణ గడ్డ విముక్తం చెందింది. గడీల పాలన నుంచి బయయటపడ్డారు. మలితరం ఉద్యమంలో తొలిసారిగా అమరుడైన శ్రీకాంతాచారికి నివాళిగా ప్రజలు కెసిఆర్‌ను గద్దె దించారు.

మొదటిపేజీ తరువాయి

# తెలంగాణలో ప్రజాస్వామ్య పునరుద్దరణ

హైదరాబాద్,డిసెంబర్3 (మరో ఉదయం): తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్దరిస్తామని, ప్రజాస్వామిక తెలంగాకు శ్రీకారం చుడతామని పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగరెస్ విజయాన్ని తెలంగాణ ప్రజలకు అంకితం చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా తొలి అమరుడు శ్రీకాంతాచారికి నివాళి అర్పించారు. కాంగ్రెస్ విజయం సాధించిన తరవాత ఆయన పరిశీలకులు మాణిగం ఠాక్రే తదితరులతో కలసి గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రగతి భవన్ ఇక బీఆర్ అంబేద్కర్ ప్రజా భవన్‌గా ఉంటుందని రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ అసెంబ్లీ ప్రగతి భవన్ ఇక సామాన్యులకు తలుపులు తెరుస్తుందన్నారు. సచివాలయం ఇక సామాన్యుడికి తెరుచుకుంటాయని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామిక విలువలు పెంపొందించడానికి జర్నలిస్టులు సహకరించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయానికి మద్దతు పలికిన తెలంగాణ జన సమితి నేత కోదండరామ్, మిత్ర పక్షం సీపీఐకి, సీపీఐ మాజీ రాజ్యసభ్యుడు అజీజ్ పాషాలకు ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ అంబేద్కర్ ప్రజా భవన్ గా ప్రగతి భవన్ మారుతుందన్నారు. ఇక నుంచి ప్రగతి భవన్ కాదు.. ప్రజా భవన్.. అది ప్రజల ఆస్తి.. ప్రజల కోసం వినియోగిస్తాం అని రేవంత్ రెడ్డి చెప్పారు. రేపటి భవిష్యత్ కోసం కాంగ్రెస్ పార్టీ సారధ్యంలోని ప్రభుత్వం పని చేస్తుందని రేవంత్ రెడ్డి తెలిపారు. 2004-14 మధ్య కాలంలో అందించిన ప్రజా పాలన అందిస్తాం అని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్మాణాత్మక సూచనలు చేయాలని బీఆర్ఎస్ నాయకత్వాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, సోనియాగాంధీకి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు, సోదరుడిగా అండగా నిలిచిన, స్ఫూర్తి నిచ్చిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి, తనతో సమానంగా ప్రచారంలో పాల్గొన్న ప్రియాంక గాంధీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఏడున్నరేండ్లుగా మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా, రాష్ట్ర హోం మంత్రిగా పనిచేసి, తెలంగాణ పీసీసీ కార్యవర్గానికి ఇన్‌చార్జిగా పార్టీలో సమస్యలు పరిష్కరించినా మాణిక్ రావు ఠాక్రేకు రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఇంతకుముందు పీసీసీ అధ్యక్షుడిగా తన ఎంపిక కోసం అభిప్రాయాలు సేకరించిన, ఎంపీ మాణిక్ రావ్ ఠాగూర్‌లకు, పార్టీ విజయం కోసం నెలల తరబడి తెలంగాణలో పని చేసిన ఏఐసీసీ కార్యదర్శులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ విజయంలో కీలకంగా వ్యవహరించిన 30 లక్షల మంది నిరుద్యోగులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. ఇక ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విజయశాంతికి ధన్యవాదాలు తెలిపారు. ఇదిలావుంటే గాంధీభవన్ వద్ద ఉదయం నుంచే కోలాహలం నెలకొంది. నేతలు , కార్యాకర్తలు బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ శ్రేణులు మిఠాయిలు తినిపించుకున్నారు. కాంగ్రెస్ నినాదాలతో గాంధీభవన్ పరిసరాలు దద్దరిల్లాయి.

మొదటిపేజీ తరువాయి

# అర్థం కాని విధంగా ఫలితాలు

చేసినంత మేలు ఎవరూ చేయలేదు. సింగరేణిని ప్రైవేటీకరణ అడ్డుకోవడం.. కార్మికులకు బోనస్ ఇచ్చాం. సింగరేణి కార్మికులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చడం, వారసత్వ ఉద్యోగాలనే పెండింగ్ సమస్యను పరిష్కరించాం. కానీ, ఇవాళ అక్కడ చూస్తే అక్కడ సాధారణ మెజారిటీ వచ్చింది. ఇంకా లోతుగా అర్థం చేసుకోవాల్సి ఉందని అన్నారు. ఇంకా కూలంకషంగా ఆలోచించి చర్చించాలి. మేం కార్యకర్తలు, నాయకులు 39 అసెంబ్లీ స్థానాల్లో గెలిచేందుకు కష్టపడ్డారు. వారికి నా అభినందనలు. ఎన్నికల్లో సహజంగా ఆశిస్తాం. ఎగ్జిట్ పోల్స్ తప్పుడు.. 70 సీట్లు వస్తాయని చెప్పాం. తప్పని ప్రూవ్ చేస్తామని చెప్పాం. కానీ నేను అనుకున్నది రాలేదు. కొంత నిరాశ ఉంది కానీ.. బాధ లేదు. ప్రజలకు మాకు రెండుసార్లు అవకాశం కల్పించారు. తెలంగాణ ప్రజానీకానికి సర్వదా రుణపడి ఉంటాం. పది సంవత్సరాలు అవకాశం కల్పించారు. వారే వాళ్లకు అవకాశం ఇచ్చారని తిట్టిపోయడం అనేది.. నిందించడం అనేది భావ్యం కాదు. రాజీకాయాల్లో హుందా తనం, స్థితప్రజ్ఞత, రాజనీతిజ్ఞత చాలా ముఖ్యం. మా నాయకుడు మాకు అది నేర్పించాడు. మా నాయకుడు ఏం అంటడంటే.. గెలవంగానే పొంగిపోవద్దు.. ఓడిపోగానే కుంగిపోవద్దు. నేను మా నాయకులు, కార్యకర్తలకు చెప్పేది అదేనన్నారు. గెలిచినప్పు పొంగిపోవడం.. ఓడిపోగానే కుంగిపోవడం ఓ రాజకీయ నాయకుడి లక్షణం కాదు. ధీరుడి లక్షణం కాదు. ఎట్లాంటి ప్రతికూల పరిస్థితి ఉన్నా తెలంగాణ ఉద్యమంలో ధీరోదాత్తంగా పోరాడం. మేం ఇలాంటివి ఎన్నో చూశాం. మమ్మల్ని ఖతం చేయాలన్న ప్రయత్నాలు.. మా పార్టీని ఫినిష్ చేయాలనే ప్రయత్నాలను ఎన్నో చూశాం. కాబట్టి ఎందుకు ప్రజలు ఎందుకు నిర్ణయం తీసుకున్నారో తీసుకున్నారు.. దాన్ని మే గౌరవిస్తాం. నాకు కూడా ఎమ్మెల్యే పదవి లేదు. మీతో ఎక్కువ సేపు కూర్చొని కూలంకషంగా మాట్లాడే అవకాశం ఉంటుంది. అన్ని తెలుసుకొని మాట్లాడతాను. ఇవాళ మేం ఓడిపోయాం. కానీ, ప్రతి రోజూ ఇదే జరుగదు. ఇవాళ ఆదివారం.. ప్రతిరోజూ ఆదివారం కాదు. ఇది గుర్తించుకోవాలి. మేం మళ్లీ స్టాం÷-రగ్‌గా తిరిగి వస్తాం' అని స్పష్టం చేశారు. మొక్కవోని ధైర్యంతో ముందుకెళ్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారకరామారావు అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో ఆయన ఆదివారం సాయంత్రం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మళ్లీ ఎంత దృఢంగా ఉద్యమాన్ని ఆ నాడు ప్రతికూలతల మధ్య నడిపినమో.. 14 ఏళ్లపాటు రానేరాదనకున్న తెలంగాణన ఎట్లయితే కష్టపడి పోరాటం చేసి సాధించామో.. అదేరకమైన పోరాట స్ఫూర్తితో, అదేరకమైన మొక్కవోని ధైర్యంతో ముందుకెళ్తాం. ఎన్నుకోబడిన శాసనసభ్యులందరికీ శుభాకాంక్షలు. వారి గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు' తెలిపారు. ప్రతి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి ప్రాతినిధ్యాన్ని ప్రజలు ఇచ్చారు. ప్రతి జిల్లా ప్రాతినిధ్యం ఇచ్చి ప్రజలు గౌరవించారు కాబట్టి అదేపంథాలో ప్రతి జిల్లా సమస్యలు, నియోజకవర్గ సమస్యలు పరిష్కరించేందుకు మనవంతు పాత్ర పోషిద్దాం. ఎన్నికల్లో సహకరించిన మీడియాకు హృదయపూర్వక ధన్యవాదాలు. జరగాల్సింది జరుగుతుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాస్వామ్య ప్రక్రియలో పరిణితి ప్రదర్శించి.. ప్రజా తీర్పు శిరోధార్యం కాబట్టి.. రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు పంపారు. జరగాల్సిన ఘట్టం తర్వాత జరుగుతుంది. మేం పూర్తిస్థాయిలో కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వానికి సహకరిస్తామని తెలియజేస్తూ వారికి అభినందనలు తెలుపుతున్నాను. మా

కార్యకర్తలు, నాయకులు అందరూ పూర్తిగా ఎవరూ నిరాశకు లోనుకాకుండా పార్టీ ఆదేశాల మేరకు ముందుకు సాగాలని విజ్ఞప్తి చేస్తున్నా'నన్నారు.

మొదటిపేజీ తరువాయి

# మూడు రాష్ట్రాల్లో బిజెపి విజయం

ప్రజలు ఇచ్చిన తీర్పును వినమ్రంగా అంగీకరిస్తున్నట్లు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాఃధీ అన్నారు. అయితే సైద్దాంతిక పోరు కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లలో ఘన విజయం సాధించడం ద్వారా హిందీ హార్ట్‌ల్యాండ్‌పై తన పట్టును బిజెపి మరింతగా బిగించింది. అయితే తెలంగాణలో అధికార బిఆర్ఎస్‌ను గద్దెదించడంలో కాంగ్రెస్ కృతకృత్యమైంది.' మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ ప్రజలు ఇచ్చిన తీర్పును మేము వినమ్రంగా అంగీకరిస్తున్నాం. అయితే సైద్దాంతిక పోరు కొనసాగుతుంది' అని ఎక్స్‌లో హిందీలో చేసిన పోస్టులో రాహుల్ అన్నారు. తెలంగాణ ప్రజలకు నేను కృతజ్ఞతలు చెబుతున్నాను. 'ప్రజల తెలంగాణ' చేస్తామన్న హామీని మేము కచ్చితంగా నెరవేరుస్తాం. తీవ్రంగా శ్రమించిన మద్దతు ఇచ్చిన పార్టీ కార్యకర్తలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు' అని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించడం ద్వారా తెలంగాణ ప్రజలు చరిత్ర సృష్టించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. ' ఇది రాష్ట్రప్రజల, కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతిఒక్క కార్యకర్త విజయం. తెలంగాణ ప్రజలకు నా హృదయపు లోతుల్లోంచి కృతజ్ఞతలు. తెలంగాణ ప్రజల సుఖశాంతులు, ప్రగతికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది' అని ప్రియాంక ఓ ట్వీట్‌లో అన్నారు. 'మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష పాత్రను అప్పగించారు. ప్రజల నిర్ణయాన్ని వినమ్రంగా అంగీకరిస్తున్నాం' అని కూడా ఆమె అన్నారు.

# అనూహ్య ఫలితాలతో కెసిఆర్ ఖంగు

మొదటిపేజీ తరువాయి

గానే రాజ్ భవన్ కు వెళ్లారు. అనంతరం గవర్నర్ తమిళిసైకి తన రాజీనామా లేఖను కేసీఆర్ సమర్పించారని సమాచారం.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమనేతగా కేసీఆర్ రాజకీయం మరోస్థాయికి చేరుకుంది. 2014లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి తెలంగాణకు తొలి సీఎంగా కేసీఆర్ ఘనత సాధించారు. ఆపై 2018లో ఆరు నెలల ముందే ముందస్తు ఎన్నికలకు వెళ్లి ఏకంగా 88 స్థానాల్లో టీఆర్ఎస్ విజయం సాధించడంతో వరుసగా రెండోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. 2014 నుంచి నేటివరకు దాదాపు తొమ్మిదిన్నరేళ్లు ముఖ్యమంత్రిగా కేసీఆర్ తన సేవలు అందించారు. మరోవైపు ఎమ్మెల్యేగా కామారెడ్డి నుంచి కేసీఆర్ ఓటమి చెందారు. ఉత్కంఠభరితంగా సాగిన కామారెడ్డి పోరులో చివరకు బీజేపీ అభ్యర్థిని విజయం వరించింది. సమీప ప్రత్యర్థి కేసీఆర్ పై బీజేపీ నేత రమణారెడ్డి విజయం సాధించి బీఆర్ఎస్ శ్రేణులకు భారీ షాకిచ్చారు. అయితే సీఎంతో పాటు మరో పార్టీ సీఎం అభ్యర్థిని ఓడించి తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారారు బీజేపీ నేత వెంకట రమణారెడ్డి. ప్రత్యేక రాష్ట్రం సాధనే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని స్థాపించారు. టీఆర్ఎస్ అధ్యక్షుడైన కేసీఆర్ 14వ లోక్‌సభలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని కరీంనగర్ లోకసభ నియోజకవర్గంకు ప్రాతినిధ్యం వహించారు. 2004 నుండి 2006 వరకు కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేక రాష్ట్రం సాధనే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని స్థాపించాడు. 2004లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ తో కలిసి పోటీచేసి 5 లోక్‌సభ స్థానాలు నెగ్గారు. తరువాత రాజకీయ పరిణామాలతో యూపీఏ నుంచి వైదొలిగారు. 15వ లోక్‌సభలో మహబూబ్‌నగర్ నుండి విజయం సాధించారు. 2014 జూన్ లో తెలంగాణకు కేసీఆర్ తొలి సీఎం అయ్యారు. ఆపై 2018 డిసెంబరు 7న జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి, డిసెంబరు 13 గురువారం మధ్యాహ్నం 1:25 నిమిషాలకు రాజ్ భవన్‌లో కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రిగా రెండవసారి పదవీబాధ్యతలు చేపట్టారు. గ్యాప్ లేకుండా ఎక్కువ కాలం సీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన నేతల్లో ఒకరిగా కేసీఆర్ నిలిచారు. ఇకపతోఏ గజ్వేల్ నియోజకవర్గం నుంచి ఈటెల రాజేందర్‌పై 45వేలకు పైగా ఓట్లతో గెలుపొందారు.

# మారిన కాంగ్రెస్ పార్టీ వ్యూహం

మొదటిపేజీ తరువాయి

పిలుపునిచ్చారు. ఇప్పటికే రేవంత్ రెడ్డి, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ హోటల్‌కు చేరుకున్నారు. ఇక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా వరుసగా ఈ సమావేశానికి హాజరవుతున్నారు. ఎమ్మెల్యేలంతా వచ్చాక సీఎల్పీ నేతను ఎన్నుకోనున్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని గవర్నర్ తమిళిసైను సీఎల్పీ బృందం కోరనుంది. ఇక సోమవారం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. సీఎం ఎంపిక విషయంలో ఏఐసీసీ సూచన మేరకు తుది నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యేలు ఏకగ్రీవ తీర్మానం చేయనున్నారు. రేవంత్ సీఎంగా ఉంటే బాగుంటుందని మెజారిటీ ఎమ్మెల్యేలు సపోర్టు చేస్తున్నారు. అయితే రాజ్‌భవన్‌లో ప్రమాణం చేసే అవకాశం ఉంది. ఈ కార్యక్రమానికి రాహుల్, ప్రియాంక , సోనియాలు హాజరవుతారని తెలుస్తోంది. మరోవైపు సిఎల్పీ నేత ఎంపిక సోమవారం ఉదయం ఉంటుందని కాంగ్రెస్ సమచారం ఇచ్చింది.

# జనసేనకు పరాభవం

## పోటీ చేసిన 8స్థానాల్లో ఓటమి

హైదరాబాద్,డిసెంబర్3(మరో ఉదయం): తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు ఉత్కంఠరేపాయి. పవన్ కళ్యాణ్‌ను ముందు పెట్టుకుని లాభపడాలన్న బిజెపి ఆశలు ఆవిరయ్యాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన జనసేనపార్టీ అభ్యర్థులు ఓటమి చెందారు. భారతీయ జనతాపార్టీతో పొత్తు పెట్టుకుని ఎనిమిది నియోజకవర్గాల్లో పోటీ చేసిన జనసేనపార్టీ అభ్యర్థులకు ఒక్కచోట కూడా విజయావకాశాలు కనిపించలేదు. పార్టీ అధ్యక్షుడు సినీనటుడు పవన్ కళ్యాణ్ స్వయంగా పార్టీ అభ్యర్థుల విజయం కోసం ప్రచారం నిర్వహించినప్పటీకి శ్రమకు తగిన ఫలితం అందుకోలేకపోయారు.కనీసం సెటిలర్స్ ఓట్లు అధికంగా ఉన్నాయని భావించే కూకట్‌పల్లి నియోజకవర్గంలో నైనా విజయంపై ఆశలు పెట్టుకున్న ఆ పార్టీ అధినేతకు అక్కడ కూడా పరాయజం తప్పలేదు.ఈ ఎన్నికల్లో సినీగ్లామర్ ఏ మాత్రం పనిచేయలేదు. పార్టీ పరాజయం పాలవటంతో జనసేన పార్టీ ప్రాధానకార్యాలయం వెలవెలబోతోంది.

# నల్లగొండలో కాంగ్రెస్ ఆధిక్యం

## ఉత్తమ్, కోమటిరెడ్డిల విజయం

## భువనగిరిలో కుంభం గెలుపు

నల్గొండ,డిసెంబర్3(మరో ఉదయం): ఉమ్మడి నల్గొండ జిల్లాలో దాదాపుగా కాంగ్రెస్ స్వీప్ చేసింది. ఇక్కడి నుంచి పోటీ చేసిన ఇద్దరు ఎంపిలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు విజయం సాధించారు. తొలిసారిగా ఐదుగురు కాంగ్రెస్ అభ్యర్థులు అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు. భువనగిరిలో కుంబం అనిల్ కుమార్ రెడ్డి, మిర్యాలగూడలో బత్తుల లక్ష్మారెడ్డి, నాగార్జునసాగర్‌లో కుందూరు జైవీర్ రెడ్డి, ఆలేరులో బీర్ల ఐలయ్య, తుంగతుర్తిలో మందుల సామెల్ అసెంబ్లీలోకి ఎంట్రీ ఇవనున్నారు. అనీల్ కుమార్ రెడ్డి మినహా కొత్త అభ్యర్థులను కాంగ్రెస్ బరిలోకి దింపి విజయం సాధించింది. అయితే బీఆర్ఎస్ మాత్రం సిట్టింగ్‌లకు సీట్లు ఇచ్చి బోల్తా పడింది.




# సిఎం పదవి ఇస్తే గౌరవంగా స్వీకరిస్తా

## మల్లు భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్,డిసెంబర్3(మరో ఉదయం): ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో తొలిసారి కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని కైవసం చేసుకుంది. తెలంగాణ ఇచ్చామనే పేరు ఉన్నప్పటికీ దాదాపు 10 ఏళ్లుగా అధికారానికి దూరంగా ఉన్న హస్తం పార్టీ తొలి సారి రాష్ట్రంలో పాలనను చేపట్టబోతుంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను నిజం చేస్తూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సారి కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేసింది. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడిన ఓటర్లు హస్తం పార్టీని గద్దెనెక్కించారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్న కాంగ్రెస్ ఇక పాలనను మొదలుపెట్టడమే మిగిలి ఉంది. దీంతో ఊరువాడా కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందోత్సాహం నెలకొంది. కార్యకర్తలు, నేతలు టపాసులు పేల్చి సంబరాలు చేసుకుంటున్నారు. మధిరలో కాంగ్రెస్ నేత మల్లు భట్టి విక్రమార్క విజయం సాధించారు. భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ విజయంపై సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మాట్లాడారు. తెలంగాణలో దొరల పాలన పోయిందని, ప్రజల తెలంగాణ వచ్చిందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా గెలిచిన అభర్థులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ తరఫున ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తామని చెప్పారు. అంతేకాకుండా సీఎం పదవి ఇస్తే బాధ్యతగా భావిస్తానని కీలక వ్యాఖ్యలు చేశారు.

SUN - M U_SAT - M U.qxd 03-12-2023 11:57 PM Page 3



# దొరహంకారంపై ప్రజల తిరుగుబాటు

- కెసిఆర్ అహంకారంపై అంకుశం
- పదేళ్ల కెసిఆర్ నిరంకుశ పాలనకు చరమగీతం
- కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం కట్టబెడుతూ తీర్పు
- కుటుంబ పాలనను ఈసడించుకున్న తెలంగాణ జనం
- ప్రజల తిరుగుబాటులో ఓటమి చెందిన కెసిఆర్, మంత్రులు
- కామారెడ్డిలో ఘోరంగా ఓటమి చెందిన సిఎం కెసిఆర్
- పలువురు మంత్రులు పరాజయం..కాంగ్రెస్ ప్రముఖుల గెలుపు
- కొడంగల్‌లో రేవంత్ రెడ్డి ఘన విజయం..
- పనిచేయని జనసేన మంత్రం
- అనూహ్యంగా బలం పెంచుకున్న బిజెపి
- పోటీచేసిన ఒక్క స్థానంలో సిపిఐ విజయం
- పాలేరులో డిపాజిట్ కోల్పోయిన సిపిఎం నేత తమ్మినేని వీరభద్రం

హైదరాబాద్,డిసెంబర్3 (మరో ఉదయం):

పదేళ్ల ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో మార్పు జరిగింది. ప్రజలు కోరుకున్న మార్పు వచ్చింది. నియంతగా తయారైన కెసిఆర్‌ను ప్రజలు ఇంటికి పంపారు. మాకొద్దీ దొరతనం అంటూ నినదించారు. ప్రగతిభవన్‌కు, సచివాలయానికి ప్రజలను దూరం చేసిన నియంతను.. వాటికే దూరం చేస్తూ ప్రజలు గట్టి తీర్పును ఇచ్చారు. ఇక ఫామ్ హౌజ్‌లో నిరంతరం విశ్రాంతి తీసుకునే అవకాశం ఇచ్చారు. కెసిఆర్ అహంకారంపై అంకుశం దింపారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత మూడోసారి జరిగిన ఎన్నికల్లో ప్రజలు అహంకారపూరిత కెసిఆర్‌కు వ్యతిరేకంగా స్పష్టమైన తీర్పును ఇచ్చారు. కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారు. స్పష్టమైన ఆధిక్యాన్ని ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇచ్చారు. అధికార బిఆర్‌ఎస్‌ను కేవలం ప్రతిపక్షానికే పరిమితం చేశారు. అనూహ్యంగా బిజెపి పలుచోట్ల గెలుపొంది తన సంఖ్యను పెంచుకుంది. ఇకపోతే అన్నింటికి మించి కామారెడ్డిలో కెసిఆర్‌ను ఘోరంగా ఓడించారు. బహుశా ఎన్నికల చరిత్రలో కెసిఆర్‌కిది తొలి ఓటమిగా గుర్తించాలి. కామారెడ్డిలో బిజెపి అభ్యర్థి వెంకటరమణారెడ్డి చేతిలో పదివేల పైచిలుకు ఓట్లతో ఓటమి చెందారు. ఇక్కడ పోటీ చేసిన రేవంత్ రెడ్డి ఓటమి చెందినా..కొడంగల్‌లో భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఇకపోతే పలువురు మంత్రులు కూడా ఓటమి చెందారు. పవన్ కళ్యాణ్ ప్రచారం పనిచేయలేదు. జనసేన నుంచి పోటీ చేసిన వారంతా ఓటమి చెందారు. సిపిఐ నుంచి కొత్తగూడెం నుంచి పోటీచేసిన కూనంనేని సాంబశివరావు గెలుపొందగా.. పాలేరులో పోటీ చేసిన సిపిఐ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఘోరంగా ఓటమి చెందారు. ఆయనతో పాటు పోటీచేసిన సిపిఎం అభ్యర్థులంతా ఓటమి చెందగా.. డిపాజిట్లు గల్లంతయాయి. మొత్తంగా తెలంగాణ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు అనుకూలంగా స్పష్టమైన తీర్పును ఇచ్చారు. కాంగ్రెస్‌లో గడ్డం సోదరులు వివేక్ వెంకట స్వామి, వినోద్‌లు చెన్నూరు, బెల్లంపల్లిలో విజయం సాధించారు. నల్లగొండలో కోమటిరెడ్డి సోదరులు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మావతి కూడా విజయం సాధించారు. బిజెపి అనూహ్యంగా మూడు సీట్ల నుంచి 9 సీట్లకు ఎదగడం విశేషం. పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి ఒంటిచేత్తో కాంగ్రెస్ పార్టీ విజయానికి చేసిన కృషి ఫలించింది. కెసిఆర్‌ను కెసిఆర్ భాషలోనే తిడుతూ..అక్రమలను ఎండగడు తూ చేసిన ప్రచారం ఫలితాన్ని ఇచ్చింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు, ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ స్వీప్ చేసింది. ఉత్తర, దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పలు సీట్లను గెలుచుకుంది. గతంలో గెల్చి, అధికార బిఆర్‌ఎస్‌లో చేరిన 9మంది ఎమ్మెల్యేలు ఓడిపోయారు. కొత్తగా వచ్చిన పలువురు మహిళలు కూడా విజయం సాధించడం విశేషం. మొత్తంగా తెలంగాణ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించింది. ఈసారి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టబెట్టారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ గెలుపు దిశగా స్పష్టమైన మెజార్టీ సాధించింది. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బీఆర్ఎస్ గెలుపొందగా.. మిగిలిన అన్ని జిల్లాల్లో సంపూర్ణంగా కాంగ్రెస్ అధిక్యంలో నిలిచింది.బెల్లంపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్, వేములవాడ లో కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ విజయం సాధించారు. తొలిసారిగా రాజకీయాల్లోకి వచ్చి మెదక్ బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ విజయం సాధించారు. హుజుర్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, నల్లగొండలో కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నకిరేకల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం, మునుగోడులో కాంగ్రెస్ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి, నాగార్జున సాగర్‌లో జానారెడ్డి కొడుకు జయవీర్‌రెడ్డి విజయం సాధించారు. మంథనిలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీధర్‌బాబు, జగిత్యాలలో జీవన్ రెడ్డిలు గెలుపొందారు. నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్‌రావు, దేవరకొండలో కాంగ్రెస్ అభ్యర్థి బాలు నాయక్ గెలుపు పాలేరులో కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి గెలుపొందారు. ఇకపోతే కేంద్రమంత్రి, బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డికి సొంత నియోజకవర్గంలో షాక్ తగిలింది. అంబర్‌పేటలో బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ మరోమారు విజయం సాధించారు. ఇక్కడ పోటీ చేసిన మాజీమంత్రి కృష్ణయాదవ్ ఓటమి చెందారు. అలాగే దుబ్బకాలో బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు ఓటమి పాలయ్యారు. ఇక్కడ మెదక్ ఎంపి, బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించారు. నిర్మల్‌లో బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి విజయం సాధించగా, ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ గెలుపొందారు. బాన్సువాడలో బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డి విజయం సాధించారు. మేడ్చల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డి గెలుపొందారు. సనత్‌నగర్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్ , మహేశ్వరం బీఆర్ఎస్ అభ్యర్థి సబిత గెలుపొందారు. కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి వివేక్, సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గెలుపొందారు. చాంద్రాయణ గుట్టలో అక్బరుద్దీన్ ఓవైసీ గెలుపొందారు. తెలంగాణలో కాంగ్రెస్ ధాటికి పోటీ చేసిన మంత్రులు చాలా మంది ఓటిమి బాటపట్టారు. జనాల్లో ఉంటూ భారీగా ఖర్చు పెట్టిన వాళ్లు విజయం సాధించారు. అలాంటి వారిలో మంత్రి మల్లారెడ్డి ఒకరైతే... సనత్‌నగర్ నుంచి తలసాని శ్రీనివాస్ యాదవ్ మరోసారి గెలుపొందారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో చాలా మంది మంత్రులు ఓడిపోయినా మంత్రి మల్లారెడ్డి మాత్రం మరోసారి విజయం సాధించారు. మేడ్చల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన రెండోసారి విజయం సాధించారు. ఈసారి మల్లారెడ్డి తోటకూర వజ్రేశ్ యాదవ్‌పై విజయం సాధించారు. ఇక్కడ పోటీలో ఉన్న బీజేపీ అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి మూడో స్థానానికి పరిమితం అయ్యారు. ప్రముఖ విద్యాసంస్థల అధినేతగా 2014లో టీడీపీ తరుపున మొదటి సారి మల్కాజిగిరి నుంచి పోటీ చేశారు. 2014లో ఎంపీగా విజయం సాధించారు. తర్వాత ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో కారు గుర్తుపై పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి అయిన కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిపై 88వేల ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. అప్పటికే ఎమ్మెల్యేగా ఉన్న సుధీర్ రెడ్డికి బదులు మల్లారెడ్డికి టికెట్ ఇచ్చారు. మల్లారెడ్డి విజయం సాధించిన తర్వాత ఆయన మంత్రిగా కూడా పని చేశారు. సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ హ్యాట్రిక్ సాధించారు. మొత్తంగా ఆయన ఆరు సార్లు విజయం సాధించారు. ఒక ఉపఎన్నికతోపాటు మూడుసార్లు సికింద్రాబాద్ నుంచి

మూడు సార్లు సనత్ నగర్ నుంచి జయకేతనం ఎగరేశారు. 2014 వరకు తలసాని టీడీపీలో ఉండే వారు. మారిన రాజకీయ పరిస్థితులతో ఆయన బీఆర్ఎస్‌లో చేరి మంత్రి అయ్యారు. 2018లో విజయం సాధించి మరోసారి మంత్రి అయ్యారు. 2018లో తన సమీప ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి కూన వెంకటేష్ గౌడ్‌పై విజయం సాధించారు. ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి తుల ఉమపై విజయం సాధించారు. మహేశ్వరం నియోజకవర్గంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఐదోసారి విజయం సాధించి సత్తా చాటారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున విజయం సాధించిన సబితా ఆ తర్వాత మారిన రాజకీయ పరిస్థితులతో బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పుడు కారు గుర్తుపై పోటీ చేసి ఐదోసారి విజయం సాధించారు. కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిపై భారీ విజయం నమోదు చేసుకున్నారు. గత ఎన్నికల్లో ఆమె బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన తీగల కృష్ణారెడ్డిపై ఆమె తొమ్మిదివేల ఓట్ల తేడాతో విజయం సాధించారు.

# అశ్వారావుపేట నుంచి తొలి ఫలితం

## కాంగ్రెస్ అభ్యర్థి ఆదినారాయణ రావు గెలుపు

భద్రాచలం,డిసెంబర్3(మరో ఉదయం):

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అశ్వారావుపేట నుంచి తొలి ఫలితం వచ్చింది. ఈనియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం సాధించింది. గిరిజన రిజర్వుడ్ నియోజకవర్గంలోలో కాంగ్రెస్ పట్టు సాధించింది. ఇక్కడ కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఆదినారాయణ రావు బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావుపై విజయం సాధించారు. ఇక్కడ పొత్తుల్లో భాగంగా ఈ సీటును బీజేపీ జనసేనకు కేటాయించి ఆ పార్టీ తరపున ఎం ఉమాదేవి మూడో స్థానానికి పరిమితం అయ్యారు. ఈ నియోజకవర్గం గత చరిత్ర పరిశీలిస్తే... 2018లో ఈ నియోజకవర్గంలో టీడీపీ గెలిచించింది. తెలంగాణ వ్యాప్తంగా టీడీపీ గెలిచిన సీట్లలో ఇదొకటి. ఖమ్మం జిల్లా నుంచే ఇంకొక సీటు టీడీపీ విజయం సాధించింది. ఈసారి మాత్రం టీడీపీ ఎక్కడా పోటీ చేయలేదు. చంద్రబాబు జైలుకు వెళ్లడంతో ఆ పార్టీ పోటీకి దూరంగా ఉంది. అప్పుడు టీడీపీ తరపున పోటీ చేసిన మెచ్చా నాగేశ్వరరావు బీఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుపై 13వేలకుపైగా ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. కొన్ని రోజుల తర్వాత టీడీపీ నుంచి గెలిచిన ఇద్దరు అభ్యర్థులు మెచ్చా నాగేశ్వరరావు, సత్తుపల్లి నుంచి విజయం సాధించిన సండ్ర వెంకట వీరయ్య బీఆర్ఎస్ లో చేరిపోయారు. ఇప్పుడు అదే స్థానం నుంచి కారు గుర్తుపై పోటీ చేసిన మెచ్చా నాగేశ్వరరావు ఓటమి చవి చూశారు. అంతకు ముందు ఎన్నికల్లో మెచ్చా నాగేశ్వరరావు వైఎస్ఆర్‌సీపీ తరపున పోటీ చేసి విజయం సాధించారు. తెలంగాణ వచ్చిన తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లో ఆయన మూడు గుర్తులపై పోటీ చేశారు.



# రేవంత్ నివాసానికి డిజిపి అంజనీకుమార్

## పోలీస్ అధికారులతో వెళ్లి అభినందనలు

హైదరాబాద్,డిసెంబర్3(మరో ఉదయం):

ఫలితాలు కాంగ్రెస్‌కు అనుకూలంగ ఆరావడం, కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యం సాధించడంతో పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి ఇంటికి తెలంగాణ డీజీపీ అంజనీ కుమార్ సహా ఇతర పోలీస్ ఉన్నతాధికారులు వెళ్లారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డికి అందరూ పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. రేవంత్ రెడ్డిని కలిసిన వారిలో అంజనీ కుమార్ సహా, మహేశ్ భగవత్ తదితరులు కలిశారు. తెలంగాణ ఎన్నికల కౌంటింగ్‌లో కాంగ్రెస్ పార్టీ జోరు ప్రదర్శిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే 65కు పైగా స్థానాల్లో కాంగ్రెస్ ఆధిక్యం ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలో పోలీసులు ఉన్నతాధికారులు రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లి కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రేవంత్ సిఎం అవుతాడన్న సంకేతాలు రావడంతోనే పోలీస్ అధికారులు కలిసివుంటారు. సాధారణంగా సిఎం అవుతారన్న అభ్యర్థిని కలుసుకోవడం ఆనవాయితీ.

# కొంపముంచిన కెసిఆర్ అహంకారం

- పదేళ్ల పాలనలో బూటకపు హామీలు
- యువతను, నిరుద్యోగలును విస్మరించి పాలన
- తెలంగాణ కాంక్షలు నెరవేర్చడంతో విఫలం
- ప్రజా తీర్పులో స్పష్టమైన సందేశం

హైదరాబాద్,డిసెంబర్3 (మరో ఉదయం):

కేసీఆర్ ఒకటి తలిస్తే.. తెలంగాణ ప్రజలు మరొకటి తలిచారు. హ్యాట్రిక్ కొట్టాలన్న కేసీఆర్ ఆశలపై ప్రజలు నీళ్లు చల్లారు. దీంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత బీఆర్ఎస్ తొలిసారిగా ఓటమి పాలైంది. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మంచి మెజారిటీతో గెలిపించిన ప్రజలు ఈ ఎన్నికల్లో కర్రుకాల్చి వాతపెట్టారు. అధికారన్ని లాగేసుకుని కాంగ్రెస్‌కు కట్టబెట్టారు. ప్రజాగ్రహా నికి గురైన గులాబీ బాస్ ప్రస్తుత ఎన్నికల్లో తన ఓటమిని తానే కొని తెచ్చుకున్నారు. నాయా నిజాంలా వ్యవహరించి కొనసాగించిన పాలనకు ప్రజలు తెరదించారు. కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు అన్న తరహాలో బీఆర్ఎస్ ఓటమికి కూడా అన్నే కారణాలు ఉన్నాయని విశ్లేషకులు, ప్రజలు భావిస్తున్నారు. ముఖ్యంగా పార్టీ పేరు మార్పు బీఆర్ఎస్ ఓటమికి కారణమని కూడా విశ్లేషిస్తున్నారు. ఎన్నికలకు ఏడాది కూడా సమయం లేని పరిస్థితుల్లో జాతీయ రాజకీయాలపై పోరాటం చేస్తామంటూ కేసీఆర్ తమ పార్టీ టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చారు. జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పుతానని చెప్పి తెలంగాణ సమస్యలను పక్కన పెట్టారు. నిజానికి టీఆర్ఎస్ పేరు ఆ పార్టీకి సెంటిమెంట్‌గా మారిందనే చెప్పాలి. తెలంగాణ కోసం కొట్లాడి పోరాటం చేసి సాధించామని చెప్పుకునే కేసీఆర్ తన పార్టీ పేరులో తెలంగాణ తీసివేయడం ద్వారా తెలంగాణతో ఉన్న బంధాన్ని తెంచుకున్నారు. బూటకపు హామీలు, నిరంకుశ విధానాలు, కుటుంబ పాలనపై ప్రజలు తరిఉగబాటు చేశారు. మరోవైపు ఎన్నో కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోవడంతో కేసీఆర్ పార్టీకి పెద్ద దెబ్బ తగిలింది. అవినీతి, అక్రమాల కారణంగానే ప్రాజెక్టు కుంగిపోయిందని ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోయడం ప్రజలు గమనించారు. బీఆర్ఎస్ ఓడిపోవడానికి మరో ప్రధాన కారణం యువత. రాష్ట్రంలో నిరుద్యోగులు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. సరైన విధానంలో ఉద్యోగాల నోటిఫికేషన్‌లు ఇవ్వకపోవడం, టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీకులు బీఆర్ఎస్ పార్టీకి తలనొప్పిగా మారాయి. ఆయా అంశాలను కేసీఆర్ పట్టించుకోలేదని ఆరోపణలు

కూడా ఉన్నాయి. పేపర్ లీకుల అంశం విద్యార్థులను చికాకు పెట్టింది. రైతుబంధు పథకం కౌలు రైతులకు ఇవ్వకపోవడం కూడా బీఆర్ఎస్ పార్టీ ఓటమికి కారణంగాచెప్పాలి. రైతుబంధుతో పాటు ,ధరణి కూడా ప్రజలకు గుదిబండగా మారింది. పలు పథకాలను బీఆర్ఎస్ అమలు చేసినా అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. వికలాంగులకు పెన్షన్ పెంచడం, లబ్దిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు వంటి అంశాలు ఎన్నికలకు రెండు నెలల ముందే కేసీఆర్ చేపట్టారు. పదేళ్లు పాలించిన కేసీఆర్ ఆయా పథకాలను సక్రమంగా పట్టాలకు ఎక్కించలేదు. ఉన్న పథకాలు అమలు కాకున్నా కొత్త పథకాలతో ఊరిస్తూ వచ్చారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ నేతల్లో గర్వం, అహంకారం పెరగడం కూడా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతకు కారణమైంది. ఇవన్నీ ఎప్పటికప్పుడు మీడియా ద్వారా ప్రస్తావించినా కెసిఆర్ వాటిని ఖాతరు చేయలేదు. సిఎం కెసిఆర్ ప్రజలను కలవాల్సిన అసవరం ఏముందన్న వాదనను కెటిఆర్ బలంగా వినిపించారు.

# తెలంగాణ అసెంబ్లీలో పెరిగిన మహిళల ప్రాధాన్యం

## కొత్తగా నలుగురు మహిళా అభ్యర్థుల గెలుపు

హైదరాబాద్,డిసెంబర్3(మరో ఉదయం):

తెలంగాణ అసెంబ్లీలో ఈ సారి మహిళల సంఖ్య పెరిగింది. గత ఎన్నికల్లో ఆరుగురు మహిళా అభ్యర్థులు విజయం సాధించగా ఈ పర్యాయం వారి సంఖ్య ఎనిమిదికి చేరింది. వీరిలో నలుగురు తొలిసారిగా ఎన్నికైనవారే ఉండటం విశేషం. కొత్తగా విజయం సాధించినవారిలో కంటోన్మెంట్ నుంచి లాస్య నందిత, పాలకుర్తిలో మామిడాల యశస్విని, నారాయణ్‌పేట్‌లో పర్ణికా రెడ్డి ఉండగా, ఆసిఫాబాద్‌లో కోవా లక్ష్మి ఉన్నారు. ఇకపోతే గంలో కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్‌లో చేరి నర్సాపూర్‌లో నిలబడ్డ సునితా లక్ష్మారెడ్డి, మహేశ్వరం నుంచి సబితా ఇంద్రారెడ్డి, వరంగల్ తూర్పులో కొండా సురేఖ, ములుగులో సీతక్క, కోదాడలో పద్మావతి రెడ్డి మరోసారి అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు.గత ఎన్నికల్లో సబితా ఇంద్రారెడ్డి, గొంగిడి సునిత, హరిప్రియా నాయక్, రేఖా నాయక్, సీతక్క, పద్మా దేవేందర్ రెడ్డి ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఏడుగురు మహిళలకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించింది. వారిలో లాస్య నందిత, కోవా లక్ష్మి, సబితా ఇంద్రారెడ్డి మాత్రమే విజయం సాధించారు.










# ఎన్నికల్లో ఆరుగురు మంత్రుల ఓటమి

## కాంగ్రెస్ అభ్యర్థుల చేతుల్లో పరాజయం

## ముగ్గురు బిజెపి ఎంపిలకు తప్పని పరాభవం

## ముగ్గురు కాంగ్రెస్ ఎంపిల గెలుపు

హైదరాబాద్,డిసెంబర్3(మరో ఉదయం)

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వెలువడ్డాయి. కేసీఆర్ సర్కార్‌లో మంత్రులుగా కొనసాగిన వారిలో ఆరుగురు ఓడిపోయారు. పువ్వాడ అజయ్ కుమార్, ఇంద్రకరణ్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, నిరంజన్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, శ్రీనివాస్ గౌడ్ ఓటమి పాలయ్యారు. ఖమ్మం నియోజకవర్గంలో పువ్వాడ అజయ్‌పై తుమ్మల నాగేశ్వర్ రావు, నిర్మల్‌లో ఇంద్రకరణ్ రెడ్డిపై మహేశ్వర్ రెడ్డి, ధర్మపురిలో కొప్పుల ఈశ్వర్‌పై అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వనపర్తి నియోజకవర్గంలో నిరంజన్ రెడ్డిపై తుడి మేఘా రెడ్డి, పాలకుర్తిలో దయాకర్ రావుపై యశస్విని రెడ్డి, మహబూబ్‌నగర్‌లో శ్రీనివాస్ గౌడ్‌పై యెన్నం శ్రీనివాస్ రెడ్డి గెలిచారు. ఆరుగురు మంత్రులపై గెలిచిన వారంతా కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులే కావడం విశేషం. కేవలం నిర్మల్‌లో మాత్రమే మహేశ్వర్ రెడ్డి బీజేపీ తరపున గెలిచారు. ఎర్రబెల్లి దయాకర్ రావుపై పోటీ చేసిన యశస్విని రెడ్డి తొలిసారిగా గెలిచారు. తుడి మేఘా రెడ్డి కూడా తొలిసారి అసెంబ్లీ గడప తొక్కనున్నారు. అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కూడా తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు. గెల్చిన మంత్రుల్లో వేముల ప్రశాంత రెడ్డి, కెటిఆర్, హరీష్ రావు, గంగుల కమలాకర్, జగదీశ్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి ఉన్నారు. బాన్సువాడలో స్పీకర్ పోచారం కూడా ఉన్నారు. ఇకపోతే బిజెపి నుంచి బరిలోకి దిగిన ముగ్గురు ఎంపిలు ఘోరంగా ఓటమి చెందారు. కరీంనగర్ నుంచి పోటీ చేసిన బండి సంజయ్, కోరుట్లలో ధర్మపురి అర్వింద్, ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో ఎంపి సోయం బాపూరావు కూడా ఓటమి పాలయ్యారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విచిత్రం చోటు చేసుకుంది. బీజేపీ ఎంపీలుగా కొనసాగుతూ, అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగిన ముగ్గురు ఓటమి పాలయ్యారు. ఆ మాదిరిగానే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ముగ్గురు కాంగ్రెస్ ఎంపీలు గెలుపొందారు. ముగ్గురు బీజేపీ ఎంపీలు బీఆర్ఎస్ అభ్యర్థుల చేతిలో ఓడిపోయారు. ల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి కొడంగల్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. భువనగిరి ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. నల్లగొండ అసెంబ్లీ స్థానం నుంచి విజయం సాధించారు. నల్లగొండ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి.. హుజుర్‌నగర్ నుంచి

ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ ముగ్గురు కూడా బీఆర్ఎస్ అభ్యర్థులపై విజయం సాధించారు.నిజామాబాద్ ఎంపీగా కొనసాగుతున్న ధర్మపురి అరవింద్.. ఈ ఎన్నికల్లో కోరుట్ల నుంచి బరిలో దిగారు. కోరుట్లలో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ చేతిలో అరవింద్ ఓడిపోయారు. ఇక కరీంనగర్ ఎంపీగా కొనసాగుతున్న బండి సంజయ్.. అదే అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ చేతిలో బండి చిత్తుగా ఓటమి చవిచూశారు. ఆదిలాబాద్ ఎంపీగా ఉన్న సోయం బాపురావు.. బోథ్ నుంచి పోటీ చేశారు. బోథ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ గెలుపొందారు.

మరో ఉదయం

# ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడం పట్ల

## జిల్లా కలెక్టర్

## డాక్టర్ ప్రియాంక అల హర్షం

కొత్తగూడెం డిసెంబర్ 3 మరో ఉదయం

ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగింపు పట్ల జిల్లా కలెక్టర్ ప్రియాంక అల చేశారు.అక్టోబర్ 9వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి నవంబర్ 30వ తేదీన జరిగిన పోలింగ్, డిసెంబర్ 3వ తేదీన జరిగిన కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల నిర్వహణలో జిల్లా ప్రజల సహాయ, సహకారాలు భాగస్వామ్యం మరువలేనిదని ఆమె పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ఆమె అభినందనలు తెలియజేశారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతమైన మన జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించడం ఎంతో అభినందనీయమని, ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన అధికారులకు, అనధికారులకు, జిల్లా ప్రజలకు, పాత్రికేయులకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు.



# వైరా నియోజకవర్గంలో కాంగ్రెస్ సునామి

## కాంగ్రెస్ అభ్యర్థి మాలోత్ రామదాస్ నాయక్.

## 33,069 ఓట్ల మెజారిటీతో గెలుపు..

వైరా డిసెంబర్ 3 మరో ఉదయం

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వైరా నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సునామీని సృష్టించారు. 33 వేల 69 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూవైరా నియోజకవర్గ ప్రజలకు సేవ చేసి అదృష్టం కల్పించిన నియోజకవర్గ ప్రజలకు (దేవుళ్ళకు) శిరస్సు వంచి నమస్కారం తెలియజేస్తున్నాను..తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుంది, తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన తల్లి సోనియా గాంధీ కల నెరవేరింది.కొత్తగా ఏర్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒళ్ళు దాచుకోకుండా అత్యధిక నిధులు తెచ్చి వైరా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి అగ్రభాగంలో నిలుపుతాను, నాకు ఓటు వేసి గెలిపించిన వారికి, నేను గెలవాలని కోరుకున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.



# అధిక మెజారిటీతో విజయం సాధించిన మహబూబాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య మురళి నాయక్

మహబూబాబాద్ డిసెంబర్ 4 (మరో ఉదయం)

తెలంగాణ వ్యాప్తంగా ఆదివారం ఉదయం నుండి కౌంటింగ్ ప్రారంభం కాగా పోస్టల్ బ్యాలెట్ నుంచి కాంగ్రెస్ ఆధిపత్యం సాగిస్తూ వచ్చింది, భూక్య మురళి నాయక్ కాంగ్రెస్ నుంచి 1,03,270 ఓట్లు కైవసం చేసుకోగా, బిఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ 59,403 ఓట్లు సాధించగా, మూడవ స్థానానికి పరిమితమైన జాటోత్ హుస్సేన్ నాయక్ మాత్రం 15,989 ఓట్లకే పరిమితమయ్యారు కనీవిని ఎరుగని రీతిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ,అధిక మెజారిటీతో మహబూబాబాద్ శాసనసభ స్థానాన్ని కైవసం చేసుకోవడం పట్ల ప్రజలు హర్షద్వానాల తో తమ ఆనందాన్ని వ్యక్తపరుస్తూ ఆయా గ్రామాలలో కేకులు కట్ చేస్తూ వారి ఆనందాన్ని వ్యక్తపరిచారు ఈ విజయం నా ఒక్కనిదే కాదు ప్రజలందరిది అని కాంగ్రెస్ అభ్యర్థి మురళి నాయక్ అన్నారని సమాచారం



# ప్రజాధరణ పొందిన నాయకుడు భట్టి విక్రమార్క.

## మధిర లో ఓటమెరుగని నేత

## వరుసగా నాలుగో సారి ఎమ్మెల్యేగా గెలుపొందిన బట్టి

మధిర డిసెంబర్ 3 మరో ఉదయం

మధిర నియోజకవర్గం ఎమ్మెల్యే భట్టి విక్రమార్క గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు. దాదాపు 2009 నుంచి ఓటమి లేని నేతగా కొనసాగుతున్నాడు. అధికారంలో ఏ పార్టీ ఉన్నప్పటికీ మధిరలో మాత్రం భట్టి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నాడు. మధిర నియోజకవర్గ ప్రజలు భట్టిని ప్రతీ సారి ఆశీర్వదిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తరపున వైఎస్ రాజశేఖర్ రెడ్డి తరువాత పాదయాత్ర చేసి అంత ప్రజాధరణ పొందిన నాయకుడు భట్టి విక్రమార్క.ముఖ్యంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి అవగాహన కలిగిన నాయకుడు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 18 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిస్తే.. అందులో బీఆర్ఎస్ పార్టీలో చేరినప్పుడు కష్టకాలంలో పార్టీని కాపాడుకుంటూ కార్యకర్తలను, నాయకులను కాపాడుకుంటూ వచ్చిన నాయకుడు భట్టి విక్రమార్క మాత్రమే. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర కాశ్మీర్ నుంచి కన్యకుమారి వరకు చేశాడు. ఇది విజయవంతం అవ్వడంతో తెలంగాణ రాష్ట్రంలో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు నిర్వర్వామంగా అలుపెరుగని బాటసారిగా 1364 కిలోమీటర్లు 115 రోజుల పాటు పాదయాత్ర చేశారు భట్టి విక్రమార్క.

రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు భరోసా కల్పించే విధంగా తన పాదయాత్ర చేసి రైతులను మహిళలను యువకులను ఇలా పేదవారిని అణగారిన, బలహీన, మైనార్టీ వెనుకబడిన వర్గాల ప్రజలందరినీ కలిసి వారి కష్టాలను విని వారికి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. ఇందిరమ్మ రాజ్యస్థాపనలో వారికే సంక్షేమ పథకాలతో ఏ విధంగా కాంగ్రెస్ అందుకుంటుందని.. అన్ని వర్గాల ప్రజలకు వివరించారు భట్టి విక్రమార్క. మధిరలో 2023 ఎన్నికల్లో భట్టి 33,365 మేజార్టీ సాధించారు.



# ప్రజా ఆశీస్సులు...

## దీవెనలతోనే కాంగ్రెస్ కు అధికారం...!

-ఓట్లేసిన తెలంగాణ యావత్తు ప్రజానీకానికి కృతజ్ఞతలు

- పాలేరు నియోజకవర్గ అసెంబ్లీ విజేత పొంగులేటి శ్రీనివాస రెడ్డి

పాలేరు డిసెంబర్ 3 మరో ఉదయం

ప్రజా ఆశీస్సులు... దీవెనలతోనే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అధికారం దక్కింది. ఓటేసి గెలిపించిన తెలంగాణ యావత్తు ప్రజానీకానికి కాంగ్రెస్ పార్టీ పక్షాన, నా పక్షాన శిరస్సు వంచి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాను. మ్యాజిక్ ఫిగర్ కు మించి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు గెలవడం ఆనందంగా ఉంది. మా అందరితో కలిసి రేపో ఎల్లుండో కొత్త ప్రభుత్వం కొలువు దీరనుంది. నాతోపాటు ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని మరో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు. నా గెలుపునకు కృషి చేసిన పాలేరు ప్రజలందరికీ రుణపడి ఉంటాను. 56,460 ఓట్ల భారీ మెజారిటీతో నన్ను విజేతగా నిలిపినందుకు ఏమిచ్చినా మీ రుణం తీర్చుకోలేను. ఖచ్చితంగా కాంగ్రెస్ సంక్షేమ పథకాలన్నీ నియోజకవర్గంలోని అర్హులందరికీ చేకూరేలా కృషి చేస్తానని మాట ఇస్తున్నాను. అలాగే నా మాట మీద గౌరవం, అభిమానంతో మిగిలిన ఎనిమిది స్థానాల్లో పోటీచేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించిన ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రజానీకానికి కూడా నా ప్రత్యేక కృతజ్ఞతలు. శక్తి వంచన లేకుండా ఇందిరమ్మ రాజ్య స్థాపన కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులందరికీ పేరుపేరునా నా తరుపున హార్ధిక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.



# కుటుంబ పాలనకు చరమగీతం సొసైటీ చైర్మన్ వెంకటరెడ్డి

జూలూరుపాడు డిసెంబర్ 3 మరో ఉదయం



వైరా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాలోత్ రామదాస్ నాయక్ ను, మరియు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు, అహర్నిశలు కృషి చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు, ప్రజలకు, సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. జూలూరుపాడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం లేళ్ల వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో కుటుంబ పాలనకు చరమ గీతం ప్రజలు పాడారని ఆయన పేర్కొన్నారు. జూలూరుపాడు లో పోలీస్ స్టేషన్ నుంచి సాయిబాబా వరకు బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం క్రాస్ రోడ్ లో మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆఫీసు వద్ద బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపీటీసీ మధుసూదన్ రావు, లేళ్ల గోపాల్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు వేల్పుల నరసింహారావు, దుద్దుకూరి నరసింహారావు నర్వినేని పుల్లారావు ,సాయిల కృష్ణయ్య, పురస్తపురి శ్రీను,పోతురాజు నాగరాజు , కోట కుమార్, మంద బాబు, దుద్దుకూరి సుమంత్, కార్యకర్తలు పాల్గొన్నారు



# ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్

మరో ఉదయం/జవహర్ నగర్.

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల భాగంలో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అయినా తోటకూర వజ్రష్ యాదవ్ పై భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే అభ్యర్థి చామకూర మల్లారెడ్డి ముప్పై మూడు వేయిల ఓట్ల మెజారిటీతో గెలిచిన సందర్భంగా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ మరియు జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు మరోసారి ఎమ్మెల్యేగా ముప్పై మూడు వేల భారీ మెజారిటీతో గెలిచినందుకు ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ తో పాటు కార్పొరేటర్లు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# కాంగ్రెస్ సంబరాలు

మరో ఉదయం ఇల్లంతకుంట

పొత్తూర్ గ్రామంలో కాంగ్రెస్ సంబరాలు ఆకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్తకు ధన్యవాదాలు ఊరులో బాణాసంచా కార్యక్రమాలు ఈ కార్యక్రమంలో రోడ్ల కర్ణాకర్ రెడ్డి ఏనుగుల నవీన్ ఆకుల రాజు. ఇరుమల్ల నరసయ్య ఓట్ల శ్రీకాంత్ మూస మధు కాంగ్రెస్ కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొనడం జరిగింది



Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com